గడువులోపు ధరణి పోర్టల్

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి, మార్చి 4 : నిర్ణీత గడువు లోపు ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్నటువంటి దరఖాస్తులు పరిష్కరించేందుకు ఈ నెల 9 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం పరిగి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆర్ఎస్ఆర్ ప్రకారం సత్వరమే పరిష్కరించాలన్నారు. మండలంలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి, ఇప్పటివరకు ఎన్ని పూర్తి చేశారు, రీ సర్వ్ సెటిల్మెంట్ రిజిస్టర్ ప్రకారం చెక్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ఉండే పహణీ ప్రకారం చెక్ చేసి రిజెక్ట్ చేయాల్సి వస్తే కచ్చితమైన కారణాలు ఉండాలన్నారు. గడువు లోపు పెండింగ్ దరఖాస్తులన్నింటినీ పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, ధరణి ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరిగిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు, వసతులు, పరీక్ష నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్‌కు అధికారులు తెలిపారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్‌లు తీసుకురాకుండా చర్యలు చేపట్టడం జరుగుతున్నదని చెప్పారు. పరీక్షా కేంద్రంలో మొత్తం 267 మంది విద్యార్థులకు 261 మంది పరీక్షకు హాజరైనట్లు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, చీఫ్ సూపరింటెండెంట్ మక్బూల్, డీవో లక్ష్మయ్య పాల్గొన్నారు.

పరిగి, వికారాబాద్‌లలో ధరణి స్పెషల్ డ్రైవ్ పరిశీలన

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలి

వికారాబాద్, మార్చి 4 : నిర్ణీత గడువు లోపు ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు ఈ నెల 9 వరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆర్ఎస్ఆర్ ప్రకారం సత్వరమే పరిష్కరించాలన్నారు. రీ సర్వ్ సెటిల్మెంట్ రిజిస్టర్ ప్రకారం సర్వే నంబర్లవారీగా గ్రామ పంచాయతీ బోర్డుపై డిస్ప్లే చేయాలన్నారు. ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవి, ఇప్పటివరకు ఎన్ని పూర్తి చేశారో తెలుసుకున్నారు. రీ సర్వ్ సెటిల్మెంట్ రిజిస్టర్ ప్రకారం చెక్ చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో ఉండే పహణీ ప్రకారం చెక్ చేసి రిజెక్ట్ చేయాల్సి వస్తే కచ్చితమైన కారణాలు ఉండాలన్నారు. గడువు లోపల పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి ఆన్‌లైన్‌లోనే కాకుండా ఫైల్స్ రూపంలో కూడా నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. చాలా జాగ్రత్తగా, వేగవంతంగా ఈ స్పెషల్ డ్రైవ్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ధరణి ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

జిల్లాలో గ్రామపంచాయతీల బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తిచేసి ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో జరిగే అభివృద్ధి నిర్మాణ పనుల్లో భాగంగా బిల్డింగ్ లేని గ్రామపంచాయతీ ఉండకూడదన్నారు. ప్రతి రోజూ జరగాల్సిన పనులకు ఎన్ని మిల్లర్లు, ఎంత మంది లేబర్ ఉంటే పనులు త్వరగా పూర్తి చేయొచ్చో ప్రణాళిక రూపొందించుకోవాలని, దాని ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బొంరాస్‌పేట్, కొడంగల్ మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఎక్కడ కూడా ఆగకూడదని, ప్రతి గ్రామపంచాయతీ బిల్డింగ్స్, స్కూల్స్ కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులను సత్వరమే పూర్తిచేయాలని ఆదేశించారు. పూర్తయిన వాటికి తప్పనిసరిగా ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో సీసీ రోడ్లకు మంజూరైన నిధులతో అంచనాలను రూపొందించుకుంటూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి లేబర్‌ను సమీకరించి పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డీఈలు, అధికారులున్నారు.

క్యాన్సర్ బారిన నిరుపేద నవీన్

ఆదుకుంటామంటూ ట్విట్టర్‌లో స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి

కులకచర్ల, మార్చి 4 : అతి చిన్న వయస్సులో బ్లడ్ క్యాన్సర్ వ్యాధికి గురైన యువకుడికి చికిత్సలు నిర్వహించేందుకు ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్‌లో పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన వడ్డె సత్యయ్య కుమారుడు 16 సంవత్సరాల యువకుడు నవీన్‌కుమార్ ఆనారోగ్యానికి గురికావడంతో వివిధ ఆస్పత్రుల్లో చూయించారు. ఎంతకూ అనారోగ్య సమస్య తగ్గకపోవడంతో మహాబూబ్‌నగర్‌లోని ఆరోగ్య ఫాలీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించగా బ్లడ్ క్యాన్సర్ ఉండే అవకాశం ఉందని కుటుంబసభ్యులకు తెలియజేయడంతో దీని కోసం వివిధ ఆస్పత్రులు తిరిగినట్లు యువకుడి తండ్రి తెలిపారు. చివరకు హైదరాబాద్‌లోని బసవ తారకం ఆస్పత్రికి వెళ్లగా ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించిన అనంతరం బ్లడ్ క్యాన్సర్ ఉందని.. దీనికి ఆరోగ్యశ్రీలో అవకాశం లేదని వైద్యులు తెలియజేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కొందరు సీఎం ఆదుకోవాలంటూ ట్విట్టర్‌లో పోస్టు పెట్టారు. కాగా ఈ విషయం మీడియాలో వైరల్‌గా మారడంతో సీఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్‌లో స్పందించారు. క్యాన్సర్ బారిన పడిన నవీన్‌కుమార్ కుటుంబానికి తాము అండగా ఉంటామని, నవీన్ సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని, ఇంత చిన్న వయస్సులో బ్లడ్ క్యాన్సర్ వ్యాధి రావడం బాధాకరం. నవీన్ చికిత్సకయ్యే ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని.. దీనికి వైద్యులు చికిత్సకు ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిమ్స్ వైద్యులకు సూచించినట్లు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కాగా యువకుడు నవీన్‌కుమార్ మహేశ్వరంలోని జ్యోతి రావుపూలే పాఠశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆనారోగ్య సమస్య కారణంగా పరీక్షకు దూరంగా ఉన్నాడు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు

వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా

రంగారెడ్డి, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : రానున్న వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా కార్యాచరణ చేపట్టాలని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన సంబంధిత ఉన్నత అధికారులతో కలిసి అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, గ్రామీణాభివృద్ధి అధికారులతో వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. ప్రిన్సిపల్ సెక్రెటరీ సూచనల మేరకు జిల్లాలో రానున్న వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా కార్యాచరణ చేపట్టాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని రూరల్ ఏరియాల్లో, అర్బన్ ఏరియాల్లో, హాబిటేషన్స్‌లో ఎక్కడా తాగునీటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలన్నారు. లీకేజ్ వంటి సమస్యలు తలెత్తకుండా పైప్ లైన్ మరమ్మతులు చేపట్టాలని, కొత్త పైప్ లైన్ కనెక్షన్లు ఇవ్వటం, వెంటనే బోర్ల మరమ్మతులు, ఫ్లషింగ్ చేయించాలని ఆదేశించారు. వేసవిలో నీటి సమస్య రాకుండా నివారించుటకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి అత్యవసరమైన మరమ్మతులు ఉంటే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నీటి సరఫరాలో ఇబ్బందులుంటే పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, పీఆర్ ఎస్ఈ రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మూలవిరాట్ లక్ష్మీనరసింహస్వామి

బ్రహ్మోత్సవాలకు వేదాద్రి ముస్తాబు

- నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు

వేదాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయం

కడ్తాల్, మార్చి 4 : తలకొండపల్లి మండలం, వెల్జాల్ గ్రామంలోని వేదాద్రిగుట్టపై వెలసిన లక్ష్మీనృసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి నుంచి ఈ నెల 7వ వరకు జరుగనున్న ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు జిల్లాతోపాటు మహబూబ్‌నగర్, హైదరాబాద్, వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు.

ఉత్సవాల వివరాలు

మంగళవారం ఉదయం 9 గంటలకు గణపతిపూజ, స్వస్తివాచనం, ఆలయ సంప్రోక్షణ,, కంకరధారణ, ఋత్విగ్వరణం, దీక్షాధారణ, పంచగవ్య ప్రాశన, మంటపారాధనలు, స్వామివారికి మహాభిషేకం, లక్ష పుష్పార్చన, అగ్నిప్రతిష్ఠ, గణపతి హోమం, మూలతంత్ర హోమం, బుధవారం గణపతి పూజ, గురు వందనం, ప్రాతఃకాల మంటప పూజలు, మహాభిషేకం, లక్ష్మీ పుష్పార్చన, మహా సుదర్శన హోమం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం వేద పండితుడు సూర్యనారాయణమూర్తి ప్రవచనాలు.. రాత్రి వేళల్లో దీక్షితులు సుబ్రహ్మణ్యంతో అన్నమయ్య సంకీర్తన, సాంస్కృతిక కార్యక్రమం, 7న ఉదయం ప్రత్యేక పూజలు, 11 గంటలకు వేదాద్రి లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవం.. అనంతరం ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

కష్టేఫలి..

టీచర్ కావాలనే కల నెరవేరింది

మంతని మంజుల

మంచాల, మార్చి 4 : ప్రణాళిక, పట్టుదలతో చదివి తాను టీచర్ కావాలనే కల నెరవేరిందని మంతని మంజుల అన్నారు. మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన మంజులకు 2006లో ఆరుట్ల గ్రామానికి చెందిన చీమల రవితో వివాహం జరిగింది. చదువుకోవాలనే పట్టుదలతో, భర్త సహకారంతో డిగ్రీ, బీఈడీ, పీజీ పూర్తి చేసింది. 2012లో డీఎస్‌సీ, 2017లో టీఆర్‌టీలో టీచర్ ఉద్యోగం కోసం పరీక్ష రాసినప్పటికీ ఉద్యోగం రాలేదు. అయినా కూడా ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా మంజుల ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యా వలంటీర్‌గా పనిచేస్తూ.. మరోపక్క పాఠశాల ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకుంటూ గురుకుల పరీక్ష రాశారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో గురుకుల టీఆర్‌టీగా ఎంపికైంది. తాను టీచర్ కావాలనే కల నెరవేరడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆమె మీడియాతో చెప్పారు.

ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు

టేకూరి జంగయ్య

కడ్తాల్ : కష్టపడి చదివితే సాధించలేనిదేమీ లేదని నిరూపించాడు ఓ యువకుడు. తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన టేకూరి లక్ష్మమ్మ, చంద్రయ్యల కుమారుడు జంగయ్య. ఇటీవల వెల్లడైన పోటీ పరీక్షల ఫలితాల్లో జంగయ్య ఒకేసారి డిగ్రీ లెక్చరర్ (బోటనీ), జూనియర్ లెక్చరర్ (బోటనీ), పీజీటీ బయో సైన్స్ ఉద్యోగాలు సాధించాడు. జంగయ్య విద్యాభ్యాసం లింగరావుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు, 6 నుంచి 10వ తరగతి వరకు తలకొండపల్లి జడ్పీహెచ్ ఎస్‌లో, కేశంపేట్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ విద్య, హైదరాబాద్‌లోని సిటీ కాలేజ్‌లో బీఎస్సీ, మహబూబ్‌నగర్ పట్టణంలో బీఈడీ, తెలంగాణ యూనివర్సిటీలో ఎంఎస్సీ బోటనీ పూర్తి చేశాడు. ప్రస్తుతం వీరన్నపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న జంగయ్య మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు ఉద్యోగాలతో మదన్‌పల్లి గ్రామవాసి

గొల్ల నర్సింహులు

వికారాబాద్ : వికారాబాద్ మండలం మదన్‌పల్లి గ్రామానికి చెందిన గొల్ల నర్సింహులు 2018లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి విధులు నిర్వహిస్తున్నాడు. దీంతోపాటు పంచాయతీ సెక్రటరీ ఉద్యోగం సాధించి, ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో పీజీటీ, టీజీటీ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. మంచి మార్కులు సాధించి ఉద్యోగాలకు ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈర్లపల్లివాసికి మూడు..

మున్నూరు లావణ్య

చేవెళ్ల రూరల్ : చేవెళ్ల మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామానికి చెందిన మున్నూరు నర్సింహులు కూతురు మున్నూరి లావణ్య ఇటీవల వెలువడిన ఉపాధ్యాయ ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించింది. పదో తరగతి వరకు శంకర్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో పూర్తి చేసింది. ఇంటర్ శంకర్‌పల్లిలోని శ్రీసాయి కో-ఆపరేటివ్ జూనియర్ కళాశాలలో, డిగ్రీ చేవెళ్లలోని వివేకానంద జూనియర్ కళాశాలలో, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ (తెలుగు) పూర్తి చేసింది. ప్రభుత్వ ఉద్యోగమే ప్రధాన లక్ష్యంగా గురుకుల జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ మూడు పోస్టులకు ఎంపికైంది. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. తన భర్త పాండు ప్రోత్సాహంతో ఉద్యోగాల సాధన సాధ్యమైందని, జూనియర్ లెక్చరర్ (తెలుగు) పోస్టులో జాయిన్ అయ్యానని తెలిపారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలి


పీఆర్సీ కమిషన్ చైర్మన్ శివకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ రంగారెడ్డిజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేశవులు, రాజిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి

షాబాద్, మార్చి 4 : పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేశవులు, రాజిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నగరంలో పీఆర్సీ కమిషన్ చైర్మన్ శివకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని, 45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. సంపాదిత సెలవులు ఏడాదికి 12 ఇవ్వాలని, వీటిపై గరిష్ఠ పరిమితి 360 రోజులు ఉండాలన్నారు. రిటైర్డ్‌మెంట్ సమయంలో సెలవుల ఎన్‌క్యాష్‌మెంట్ గరిష్ఠ పరిమితి 400 రోజులకు పెంచాలన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయులుగా నియమితులైనవారికి స్పెషల్ టీచర్ సర్వీస్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. చైల్డ్ కేర్ సెలవులను 180 రోజులకు పెంచి వారి సర్వీసులు ఎప్పుడైనా వాడుకునేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగి తల్లి/తండ్రి/భర్త/భార్య/కొడుకు/కుమార్తె మరణిస్తే 11 రోజుల సెలవును ప్రత్యేక క్యాజువల్ లీవ్‌గా పరిగణించాలన్నారు. హెచ్ఆర్ఏను గ్రేటర్ హైదరాబాద్‌లో 30 శాతం, జిల్లా ప్రధాన కార్యాలయంలో 25 శాతం, మున్సిపాలిటీలకు 20 శాతం, లోపలి ప్రదేశాలకు 18 శాతం ఎటువంటి సౌకర్యం లేని గిరిజన ప్రాంతాల్లో 16 శాతం ఇవ్వాలన్నారు. ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇద్దరు పిల్లలకు ప్రతి పిల్లవాడికీ రూ.5వేలు, ఇంటర్ పిల్లలకు రూ.10వేలకు పెంచాలన్నారు. ఫెస్టివల్ అడ్వాన్స్ కేడర్ ఉద్యోగులందరికీ, నాలుగో తరగతి ఉద్యోగులకు రూ.15వేలు, ఇతర కేడర్ ఉద్యోగులకు రూ.30వేలు పేస్కేల్‌తో సంబంధం లేకుండా పెంచాలన్నారు. ఉద్యోగ విరమణ గ్రాట్యుటీ గరిష్ఠంగా పరిమితం రూ.25లక్షలు చేయబడిందన్నారు. అంత్యక్రియల ఖర్చులు ఇన్ సర్వీస్ ఉద్యోగి మరణిస్తే రూ.50వేలు, విశ్రాంత సర్వీస్ పెన్షనర్ కోసం రూ.30వేలకు పెంచాలన్నారు. ఫ్యామిలీ పెన్షనర్ కోసం రూ.25వేలకు పెంచాలన్నారు. శారీరక దివ్యాంగుల భత్యాన్ని రూ.5వేలకు పెంచాలని వారు కోరారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

షాబాద్, మార్చి 4 : రంగారెడ్డి జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన పరీక్షకు 80,523 మంది విద్యార్థులకు 78,651 మంది హాజరయ్యారు. జిల్లాలో 195 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ టీవీల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నాయి. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా జిల్లాలో నాలుగు ఫ్లయింగ్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

11న ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్

వికారాబాద్, మార్చి 4 : ఈ నెల 11న వికారాబాద్ ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, ఇంటర్మీడియట్, ఒకేషనల్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ మేళాకు హాజరు కావాలన్నారు. తోషిబా, మహీంద్ర, మారుతి సుజుకి, కార్తికేయ ఇండస్ట్రీ, నియాన్, టీఎస్ఆర్టీసీ, పెన్నార్, వోల్టా గ్రీన్, సౌత్ సెంట్రల్ రైల్వే వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9:30కి బయోడేటా, ధ్రువీకరణ పత్రాలతో హాజరవ్వాలని సూచించారు. వివరాలకు 9441430963, 8499975115లను సంప్రదించాలన్నారు.

రబీ సీజన్‌కు సంబంధించి ముందస్తు ప్రణాళికలు తయారుచేసుకోవాలి

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 4 : 2023-2024 రబీ సీజన్‌కు సంబంధించి ముందస్తు ప్రణాళికలు తయారుచేయాలని అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఎం సివిల్ సప్లై, డీఎస్‌వో, వ్యవసాయ శాఖ, లీడ్ బ్యాంక్ మేనేజర్, డీఆర్డీవో జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 7,700 ఎకరాల్లో వరి పండించారని, ఇందులో 1,19,350 ఎంఐఎస్ వరి ధాన్యం ప్యాడీ పర్చేస్ సెంటర్లోకి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో చర్చించి 126 ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లను ఓపెన్ చేయాలని అధికారులను ఆదేశించారు. సెంటర్‌లలో అన్ని సౌకర్యాలు, సరిపడు గన్నీ బ్యాగులు ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు.

పీపీసీలలో కావలసిన అన్ని రకాల ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వారు పండించిన ధాన్యానికి ఎంఎస్‌పీ రేటు వచ్చేలా అన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. మద్దతు ధర గ్రేడ్ ఏ రకం రూ.2,203, కామన్ రకం రూ.2,083 ఉంటుందన్నారు. అనంతరం ఖరీఫ్ 2023-24 సీఎంఆర్ డెలివరీ గురించి రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. రైస్ మిల్లర్లందరూ ఖరీఫ్‌కు సంబంధించి సీఎంఆర్ రైసును వెంటనే ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని మిల్లర్లను ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌వో రాజేశ్వర్, సంబంధిత అధికారులున్నారు.

90 శాతానికి పైగా చిన్నారులకు చుక్కల మందు

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో రెండో రోజు పోలియో చుక్కల పంపిణీ విజయవంతంగా సాగింది. ఆదివారం పోలియో బూత్‌లలో చుక్కలు వేయించని చిన్నారులకు సోమవారం ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది పోలియో చుక్కల మందు వేశారు. మొదటి రోజు మూడు జిల్లాల్లో దాదాపు 90 శాతానికి పైగా చిన్నారులకు చుక్కల మందు వేసిన సిబ్బంది..రెండో రోజు మరో 20శాతం మందికి వేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

సురంగల్‌లో కోడి పందేలు

- పక్కా సమాచారంతో దాడి చేసిన రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు
- 12 మంది పందెంరాయుళ్ల అరెస్టు
- 3 కార్లు, ఆరు కోడి పుంజులు, 12 సెల్‌ఫోన్లు, రూ.లక్షకు పైగా స్వాధీనం


అరెస్టు అయిన కోడి పందెంరాయుళ్లు

మొయినాబాద్, మార్చి 4 : ఓ ఫామ్‌హౌస్‌లో కోడి పందేలు నిర్వహిస్తుండగా ఎస్‌వోటీ పోలీసులు దాడిచేసి 12మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 3 కార్లు, ఆరు కోడి పుంజులు, 12 సెల్‌ఫోన్లు, రూ.లక్షక